క్లుప్తంగా

మధుకుమార్‌రెడ్డికి పీహెచ్‌డీ



తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతికి చెందిన అడివి మధుకుమార్‌రెడ్డి తంజావూర్‌లోని ప్రిస్ట్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఆయన అనాలసిస్ ఆఫ్ సర్వీస్ క్వాలిటీ అండ్ పిలిగ్రిమ్ శాటిస్‌ఫాక్షన్ ఇన్ టీటీడీ అనే అంశంపై పరిశోధన చేశారు.

సీఏ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ ప్రతిభ



వేలు



రవిపాటి హేమంత్

తిరుపతి ఎడ్యుకేషన్: సీఏ ఇంటర్, ఫైనల్ ఫలితాల్లో తమ విద్యార్థులు కె.సుజిత్‌రెడ్డి, ఆర్.భానుప్రకాష్, ఆర్.చేతన్‌రెడ్డి, పి.బాలవెంకట ఆదిత్యారెడ్డి, టి.యోగనివాస్, ఆషా టీనా, ఏవీ ఆదిత్య, ఎ.కీర్తనారెడ్డి, పి.శ్రియ ఉత్తమ ఫలితాలు సాధించినట్లు మాస్టర్‌మైండ్స్ కళాశాల అడ్మిన్ ప్రిన్సిపాల్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. వేలు, రవిపాటి హేమంత్ సీఏ పూర్తి చేశారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

తిరుపతి క్రైం: జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు, బీజేపీ రూపకర్త డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా ప్రజలకు అనేక సేవలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, పొన్న విజయ్ కుమార్ రెడ్డి, అక్కిపల్లి మునికృష్ణ యాదవ్, సుబ్రమణ్యం యాదవ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను గురువారం చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులకు మెరుగైన ఆరోగ్యం కోసం ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి, సర్పంచ్ రూప, ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులకు తెలుగుపై మక్కువ పెంచాలి

పాకాల: విద్యార్థులకు చిన్న తనం నుంచే తెలుగు భాషపై మక్కువ పెంచాలని ఎంఈవో బాబ్జీ తెలిపారు. మండలంలోని దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా విద్యా బోధన చేయాలని సూచించారు. విద్యార్థులకు చిన్న తనం నుంచే వేమన పద్యాలు, సుమతి శతకాలు, పెద్దబాలశిక్ష గురించి క్షుణ్ణంగా అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడం పూర్తయిన తరువాత వర్క్ బుక్ రాయించాలని, తప్పులు ఉంటే సరిదిద్దాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శులు విజయమోహన్‌రెడ్డెప్ప, వెంకటస్వామి, సీఆర్పీలు శ్రీనివాసులు, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత యాంటీ రేబీస్ టీకా శిబిరం

తిరుపతి ఎడ్యుకేషన్: అంతర్జాతీయ జూనోసిస్ డే సందర్భంగా గురువారం ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని పశువైద్య చికిత్సా సముదాయంలో ఉచిత యాంటీ రేబీస్ టీకా శిబిరం నిర్వహించారు. డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ వెటర్నరీ సైన్స్ డాక్టర్ బ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ డాక్టర్ ఆదిలక్ష్మమ్మ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 250 శునకాలకు టీకాలు యాంటీ రేబీస్ టీకాలు వేశారు.

రూ.51 వేల విరాళం

పాకాల: స్థానిక ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న 54 అడుగుల విగ్రహానికి రాజు బ్రదర్స్ రూ.51,116 విరాళం అందజేశారు. మొత్తాన్ని గురువారం ఉప్పరపల్లి సర్పంచ్ గౌరీశంకర్‌రాజు, చలపతిరాజు ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డికి అందజేశారు.

డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్‌గా రామకృష్ణారెడ్డి నియామకం

తిరుపతి ఎడ్యుకేషన్: ఎస్వీయూ సైన్స్ కళాశాల ఫ్యాకల్టీ డీన్‌గా ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డిని నియమిస్తూ వీసీ కే.రాజారెడ్డి, రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్ ఉత్తర్వులిచ్చారు. ఆయన ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా 31 ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఈ ఏడాది మార్చి నుంచి సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఆయనను డీన్ విజయభాస్కరరావు, ప్రొఫెసర్లు అభినందించారు.

హాకర్ల కోసం ధర్నాకు సిద్ధం

- అనుమతులున్నా కొండకు పంపలేదని వినతి
- అధికారులకు ఫోన్‌చేసి విచారించిన ఎమ్మెల్యే భూమన
- మరోసారి ఫిర్యాదులు రాకూడదని హెచ్చరిక



టీటీడీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: తమకు హాకర్ లైసెన్సులు ఉన్నప్పటికీ తిరుమల కొండకు వెళ్లేందుకు అనుమతించడం లేదని చిరు వ్యాపారులు ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డికి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఫోన్ చేశారు. తిరుమల కొండను నమ్ముకుని బతికే చిన్న వ్యాపారులకు ఇబ్బంది కలిగిస్తే వారితో కలిసి ధర్నా చేస్తామని హెచ్చరించారు. తిరుపతి నగరంలోని 30వ డివిజన్ నెహ్రూనగర్‌లో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులు మాట్లాడుతూ తాము 30 ఏళ్లుగా తిరుమలలోని మఠాలకు పూలు విక్రయించి కుటుంబాన్ని పోషించుకుంటున్నామని, తమకు హాకర్స్ అనుమతి ఉన్నప్పటికీ తిరుమల చెకింగ్ పాయింట్ వద్ద సెక్యూరిటీ సిబ్బంది కొండపైకి పంపడం లేదని ఎమ్మెల్యేకి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేశారు. చిరు వ్యాపారులను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. వారికి విక్రయ అనుమతులు ఉన్నప్పటికీ అడ్డుకుంటే సహించనని, అవసరమైతే వారితో పాటు ధర్నా చేయడానికి కూడా సిద్ధమేనని హెచ్చరించారు. ఇంకొకసారి చిరు వ్యాపారులను అడ్డుకున్నట్లు ఫిర్యాదు రాకూడదని చెప్పారు. దాంతో చిరు వ్యాపారులు ఎమ్మెల్యే కరుణాకరరెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని చేతులెత్తి మొక్కారు. గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్రనాథ్, తిరుపతి మునిరామిరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఎస్‌కె ఇమా మ్, పార్టీ నాయకులు పాముల రమేష్‌రెడ్డి, నైనారు శ్రీనివాసులు, యాదవకృష్ణ, షర్మిల, పసుపులేటి రవి, రవీంద్రనాథ్‌రెడ్డి, కన్నయ్య, శ్రీనివాసులు ప్రసన్న, విశ్వేశ్వరయ్య, బండి మణి, లోకేష్ పాల్గొన్నారు.

రూ.కోటితో పరుశురామేశ్వర ఆలయ అభివృద్ధి

చంద్రగిరి(తిరుపతి రూరల్): మండలంలోని తాటికోన సమీపంలో ఉన్న పురాతన పరుశురామేశ్వర స్వామి ఆలయాన్ని రూ.కోటితో అభివృద్ధి చేయడానికి దేవదాయశాఖ ముందుకొచ్చింది. పరుశురామేశ్వర ఆలయం సుమారు వెయ్యేళ్లకు పూర్వం నిర్మించారు. దాడులతోపాటు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టడంతో ఆలయం పాక్షికంగా దెబ్బతింది. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ చంద్రగిరి డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆలయ జీర్ణోద్ధరణ చేయాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆదేశాలతో ఆలయ పునఃనిర్మాణానికి దేవదాయశాఖ ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, దేవదాయశాఖ డీఈ శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి గురువారం ఆలయాన్ని పరిశీలించారు. త్వరలోనే రూ.కోటితో పనులు చేపడతామని పేర్కొన్నారు.

శరవేగంగా తిరుపతిలో ఇన్నర్ రోడ్ల అభివృద్ధి



జర్నలిస్ట్ కాలనీలో పర్యటిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో ఇన్నర్ రోడ్లను డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తెలిపారు. ఆయన గురువారం కార్పొరేటర్ కోటేశ్వరమ్మతో కలిసి 47వ డివిజన్ జర్నలిస్టు కాలనీలో పర్యటించారు. నాలుగైదు రోజుల్లో రోడ్ల పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల నగరంలో విలీనమైన శెట్టిపల్లి ప్రాంతంలోని రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డీఈ విజయ్‌కుమార్ రెడ్డి, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే బాబు, కార్పొరేటర్ పుల్లూరు అమర్నాథరెడ్డి, కోటూరు ఆంజనేయులు, జేసీఆర్ అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, మద్దాలి శేఖర్ పాల్గొన్నారు.

శ్రీనివాస సేతు వంతెన పనుల పరిశీలన

శ్రీనివాస సేతు వంతెన పనుల్లో భాగంగా రైల్వే బ్రిడ్జిపై ఏర్పాటుచేస్తున్న గడ్డర్ల పనులను గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత, ఇంజినీర్ చంద్రశేఖర్, ఆఫ్కాన్స్ ప్రతినిధి స్వామి పరిశీలించారు. జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శరవేగంగా పూర్తి చేసి త్వరితగతిన ప్రజలకు అందుబాటులకు తీసుకొస్తామని ఆమె చెప్పారు.

ఘనంగా గురుపూజోత్సవం



మాజీ వీసీ జమునను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : జాతీయ సంస్కృత వర్సిటీలో బుధవారం వ్యాస పౌర్ణమి సందర్భంగా సంస్కృత వర్సిటీ, రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ సంయుక్తంగా గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కంచి మఠం ఆస్థాన విద్యాంసులు గణేష్, భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ ఎం.సత్యనారాయణరాజు, ఎస్వీ ఆయుర్వేదిక్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, మహిళా వర్సిటీ మాజీ వీసీ జమున, స్విమ్స్ సర్జికల్ ఆంకాలజిస్ట్ మణిలాల్, ఆక్యుపెంచరిస్ట్ బాలాజీ, సంస్కృత వర్సిటీ ప్రొఫెసర్ దీప్త, ప్రొఫెసర్ గణేష్‌భట్‌ను సత్కరించారు. ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షుడు వైవీ.రామిరెడ్డి, జాతీయ సహ సంఘటన కార్యదర్శి గుంత లక్ష్మణ్‌జీ, రాష్ట్ర కార్యదర్శి బుల్లి దాస్, సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నేడు గేట్‌లో క్యాంపస్ సెలక్షన్స్

తిరుపతి ఎడ్యుకేషన్: చిగురువాడలోని గేట్ విద్యా సంస్థలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు ఆ కళాశాల చైర్మన్ తమ్మినేని వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఎంఎన్‌సీ సంస్థ ఎంఫసిస్ ప్రతినిధులు ఆ సంస్థలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఏ, బీకాం, బీబీఏ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రణీత్‌కుమార్‌ను 8099088704లో సంప్రదించాలని కోరారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి

తిరుపతి రూరల్: బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం తపించిన మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు, పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు కొనియాడారు. ఆయన వర్ధంతి సందర్భంగా గురువారం పేరూరులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాన్, నవీన్, దినేష్, శీనుయాదవ్, హరీష్, మహేష్, దిలీప్, సతీష్ యాదవ్, భాగ్యరాజ్, గుణ, నాగార్జున, సిద్దయ్య, గిరి, యాదగిరి పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యతకు కృషి చేయాలి



సీడ్ బాల్స్‌ను తయారుచేస్తున్న విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్: మొక్కలను విరివిగా నాటి పర్యావరణ సమతుల్యతకు మనవంతు కృషి చేయాలని ఎస్వీసీఈ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎస్వీసీఈ కళాశాలల ఎన్ఎస్ఎస్ విభాగం, సేవా నేచురియల్ సంస్థ సంయుక్తంగా గురువారం సీడ్ బాల్స్ మేకింగ్ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులతో లక్ష సీడ్ బాల్స్ తయారుచేయించనున్నట్టు తెలిపారు. అడవుల్లో వీటిని వెదజల్లడం ద్వారా వర్షాలకు అవి మొలుస్తాయని, తద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు దోహదపడతాయని వెల్లడించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు టి.చంద్రయ్య, కె.సుజన్‌కుమార్, నరేన్‌కుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేసుకోవాలి

పాకాల: మండలంలోని చెన్నుగారిపల్లి సచివాలయంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రభాకర్ మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వైద్య పరీక్షలు చేయిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అనంతరం గతంలో రక్త పరీక్షలకు నమూనాలు ఇచ్చిన వారి ఫలితాలను వివరించారు. ఎంపీపీ లోకనాథం, సర్పంచ్ కళావతి, మాజీ జెడ్పీటీసీ పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు కిషోర్‌కుమార్, వెంకటకిషోర్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



సినీ నటి హేమ

తిరుమల: శ్రీవారిని గురువారం సినీ నటి హేమ, ఏపీ ఎమ్మెల్సీలు సూర్యనారాయణ రాజు, శ్రీనివాస రావు, ఎమ్మెల్యే అప్పలనాయుడు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, తెలంగాణ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి దర్శించుకున్నారు. వారికి అధికారులు దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ఆలయ పనుల పరిశీలన

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సూచించారు. ఆయన గురువారం మూలస్థానమ్మను దర్శించుకున్నారు. అభివృద్ధి పనులపై చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఎండోమెంట్ డీఈ శ్రీనివాసులు, ఈవో రామకృష్ణారెడ్డితో చర్చించారు. ఆలయం నుంచి జాతీయ రహదారి వరకు రోడ్డు సౌకర్యం ఏర్పాటుకు ఉన్న సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరించాలన్నారు. సర్పంచ్ రూప, ఎంపీటీసీ మాధవరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, రామ్మూర్తి పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష

తిరుపతి తుడా: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం తిరుపతిలోని శ్రీకృష్ణ నగర్, ఎల్బీనగర్, చెన్నారెడ్డి కాలనీలోని వార్డు సచివాలయాలలో నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, భూమన అభినయ్ రెడ్డి పాల్గొంటారు.

గవర్నర్‌ను కలిసిన వీసీ

తిరుపతి ఎడ్యుకేషన్: పద్మావతి మహిళా వర్సిటీ వీసీ డి.భారతి గురువారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. వర్సిటీలోని కోర్సులు, ఇంటర్నేషనల్ రిలేషన్స్, స్టూడెంట్స్ ప్లేస్‌మెంట్స్, వివిధ కంపెనీలు, సంస్థలతో చేసుకున్న ఒప్పందాల గురించి వివరించారు.

తప్పుల్లేకుండా ఓటరు జాబితా

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలని తిరుపతి ఆర్డీఓ, చంద్రగిరి రిటర్నింగ్ ఆఫీసర్ కనక నరసారెడ్డి ఆదేశించారు. ఆయన గురువారం చంద్రగిరిలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నియోజకవర్గ బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నకిలీ ఓటర్లను తొలగించాలని తెలిపారు.

జగనన్నకు అండగా ఉందాం



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే భూమన, డిప్యూటీ మేయర్లు అభినయ్ రెడ్డి, ముద్ర నారాయణ

- చంద్రబాబును నమ్మొద్దు
- తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి

తిరుపతి తుడా: జగనన్న ప్రభుత్వంలో జరిగిన మంచిని గుర్తు పెట్టుకుని అండగా నిలబడాలని ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి పిలుపునిచ్చారు. ఎస్ఆర్ శంకరన్ జర్నలిస్టు కాలనీ, మధురానగర్, గాంధీ భవన్ ప్రాంతాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల కోసం చంద్రబాబు హయాంలో ఐదేళ్లకు రూ.700 కోట్లు ఖర్చు చేస్తే, జగనన్న ప్రభుత్వంలో నాలుగేళ్లలోనే రూ.2.31 లక్షల కోట్లు నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి జమ చేశారని పేర్కొన్నారు. తిరుపతి వాసులకు చంద్రబాబు ఒక్కరికి కూడా ఇంటి స్థలం ఇవ్వలేదని, జగనన్న 26,584 మందికి ఇచ్చారని వివరించారు. జగనన్న ఇప్పటి వరకు రూ.21 వేల కోట్ల డ్వాక్రా రుణమాఫీ చేశారని తెలిపారు. ఎన్నికల హామీలను 98 శాతం పూర్తిచేసిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. 14 ఏళ్లు అధికారంలో ఉన్నా ఒక మంచి పని చేశానని చెప్పుకోలేని దౌర్భాగ్య స్థితిలో చంద్రబాబు ఉన్నారని వివరించారు. కమిషనర్ హరిత మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందించాలన్న గొప్ప సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా రంజక పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే బాబు, కార్పొరేటర్లు కోటేశ్వరమ్మ, రేవతి, కల్పనా యాదవ్, టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, టౌన్ బ్యాంకు డైరెక్టర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంగళంపల్లికి ఘన నివాళి

తిరుపతి కల్చరల్: పద్మవిభూషణ్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ కర్ణాటక సంగీతంలో చెరగని ముద్ర వేసి ప్రపంచానికే సంగీతంలో ధ్రువతారగా నిలిచారని తిరుపతి వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం కొనియాడారు. ఎస్వీ సంగీత కళాశాలలోని నాదస్వరం డోలు పాఠశాలలో గురువారం మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతిని జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిరత్నం, ఈశ్వరమ్మ, గోవింద శెట్టి, ఎం.రామచంద్రయ్య, ఎస్.మునిరత్నం, కేశన్న, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆర్ఎస్ మాడవీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవాకేంద్రంలో బాలమురళీకృష్ణ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఆ కేంద్రం నిర్వాహకుడు చిత్రపు హనుమంతరావు, స్వరాజ్యలక్ష్మి, కుమారస్వామి, సుబ్బరావు, వెంకటగాయిత్రి వ్యవస్థాపకుడు సీఆర్‌కే.శేషగిరిరావు పాల్గొన్నారు.

క్షత్రియులు సేవా రంగంలో భాగస్వాములు కావాలి



అల్లూరి శ్రీరామరాజును సత్కరిస్తున్న క్షత్రియ సేవా సమితి నేతలు

తిరుపతి కల్చరల్: క్షత్రియ యువతను ఏకతాటిపైకి తీసుకువచ్చి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు మనవడు అల్లూరి శ్రీరామరాజు పిలుపునిచ్చారు. తిరుపతిలోని ఒక ప్రైవేటు హోటల్‌లో గురువారం తిరుపతి క్షత్రియ సేవా సమితి గౌరవాధ్యక్షుడు కేఎల్.వర్మ క్షత్రియ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. కేఎల్.వర్మ మాట్లాడుతూ తిరుపతిలో అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహ ప్రతిష్టాపనకు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి అంగీకరించారని తెలిపారు. త్వరలో పనులు చేపట్టి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రాధాకృష్ణ శర్మ, నెహ్రూ రాజు, వైఎస్.రాజు, జగదాభి గోపి, అనిల్ రాజు పాల్గొన్నారు.

దర్గా అభివృద్ధి పనుల పరిశీలన

తిరుపతి కల్చరల్: వీవీ మహల్ రోడ్డులోని హుస్సేన్ షావలి దర్గా, కరీమున్నీషా మసీదులో అభివృద్ధి పనులను గురువారం డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరంలోని షాదీఖానా, జీవకోన మసీద్, ముస్లింల శ్మశాన వాటికల అభివృద్ధి కోసం మున్సిపల్ కార్పొరేషన్ నిధులను ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. దర్గా ఆవరణలో నూతన షాపింగ్ కాంప్లెక్స్ పనులకు చర్యలు తీసుకోవాలని మసీద్, దర్గా కమిటీ సభ్యులు కోరారు. స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు, కో ఆప్షన్ సభ్యులు ఎస్.ఖాదర్‌బాషా, ఎస్‌కే.ఇమామ్ సాహెబ్, మసీద్ ముతవల్లి హాజీ ఫరీద్ సాహెబ్, ఆడిటర్ మహబాషా, అన్వర్, ఇస్మాయిల్, నిజాం పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు వేయించండి

చంద్రగిరి(తిరుపతి రూరల్): పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలు వేయించాలని చంద్రగిరి ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. చంద్రగిరి పశు వైద్యశాలలో గురువారం జూనోసిస్ డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువులకు వచ్చే వ్యాధులు మనుషులకు వ్యాపించే అవకాశం ఉందని, వాటికి టీకాలు వేయించాలని సూచించారు. సాయంత్రానికి 78 పెంపుడు జంతువులకు టీకాలు ఉచితంగా వేశారు. చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, సర్పంచ్ రూప, పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, స్విమ్స్ ప్రొఫెసర్ అంజువర్మ, పశు వైద్య శాఖ ఉపసంచాలకులు భవానిశంకర్, సహాయ సంచాలకులు చంద్రశేఖర్ రెడ్డి, పశు వైద్య శాఖ వైద్యులు మదన్, హేమ కుమార్ పాల్గొన్నారు.

వేదం సమాజ శ్రేయస్సుకు మార్గదర్శకం

తిరుపతి కల్చరల్: వేదజ్ఞానం సమాజ శ్రేయస్సుకు మార్గదర్శకమని వేద అధ్యయనంతోపాటు వేద విజ్ఞానాన్ని మరింత ప్రచారంతో వేద విజ్ఞాన విశిష్టతను చాటాల్సిన అవసరం ఉందని వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదా శివమూర్తి పిలుపునిచ్చారు. కంచి కామకోటి శంకరమఠంలో గురువారం శ్రీజనార్దనానంద సరస్వతీ స్వామి సంస్కృతి ట్రస్ట్ ఆధ్వర్యంలో వేద విద్వన్మహా సభలు ప్రారంభమయ్యాయి. వీసీ మాట్లాడుతూ వేదం విశిష్టతను, వేద విజ్ఞానం ఆచరణతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ట్రస్ట్ నిర్వాహకులు కందుకూరి వెంకట సుబ్రమణ్యం మాట్లాడు తూ వేద విద్వన్మహా సభల్లో వేదంపై అవగాహన కల్పించడంతోపాటు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ధర్మగిరి వేద పాఠశాల ప్రిన్సిపల్ కుప్పా శివసుబ్రమణ్యం వేద విజ్ఞానం గురించి వివరించారు. కుప్పా విశ్వనాథ శర్మ, ఆలిండియా యోగా విద్యా ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ట్రస్ట్ కైలాష్, కంచి కామకోటి శంకరమఠం మేనేజర్ శ్రీధర్, అఖిల భారత బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం సహాయ కార్యదర్శి చిదంబర రావు పాల్గొన్నారు.

పరీక్షలు వాయిదా వేయాలి

తిరుపతి ఎడ్యుకేషన్: ఎస్వీయూ పరిధిలోని డిగ్రీ కాలేజీల్లో ఈ నెల 15 నుంచి ప్రారంభంకానున్న రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. వారు గురువారం వీసీ రాజారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాధవ్ మాట్లాడుతూ యూజీసీ నిబంధనల మేర కు 90 రోజులు తరగతులు జరిగితేనే సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఇందుకు విరుద్ధంగా ఉన్నత విద్యామండలి అధికారులు పరీక్షలు నిర్వహించాలంటూ ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు



పాకాల: ధ్రువీకరణ పత్రాలు పొందిన లబ్ధిదారులతో అధికారులు, ప్రజాప్రతినిధులు

తిరుపతి రూరల్: గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ పథకాలతోపాటు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ప్రజల ఇంటి వద్దకే అందించే విప్లవాత్మక కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని పాడిపేట, ముండ్లపూడి, సీమల్లవరం సర్పంచ్‌లు ధనమునిరెడ్డి, సూరి, భారతి కొనియాడారు. రెండు పంచాయతీల్లో గురువారం జగనన్న సురక్షలో 1,180 ధ్రువీకరణ పత్రాలు అందించారు. తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, దుష్యంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

పాకాల: మండలంలోని పదిపుట్లబైలు, పేరసానిపల్లి పంచాయతీల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాల కోసం 521 దరఖాస్తులు వచ్చాయని, 501 మందికి పత్రాలు మంజూరు చేసినట్లు ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. ఎంపీపీ లోకనాథం, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఏఎస్ఓ కన్నయ్య, ఈఓపీఆర్డీ మాలతి పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

చంద్రగిరి(తిరుపతి రూరల్): జగనన్న సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చంద్రగిరి తహసీల్దార్ శిరీష పిలుపునిచ్చారు. చంద్రగిరి, కల్‌రోడ్డపల్లిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. చంద్రగిరిలో 250 మందికి, కల్‌రోడ్‌పల్లిలో 302 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. సర్పంచ్ రూప, ఎంపీడీవో రమేష్‌బాబు, సీఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉంటి వద్దకే అన్నీ

తిరుపతి మంగళం: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు ఇంటి వద్దకే అన్ని పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ రణధీర్‌పురం పంచాయతీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు. రణధీర్‌పురం పంచాయతీ బీటీఆర్‌కాలనీలోని సచివాలయం వద్ద గురువారం సర్పంచ్ లీలావతి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సర్టిఫికెట్ల కోసం 875 మంది దరఖాస్తు చేసుకున్నారని తిరుపతి అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. ఏపీఎం గురునాథ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేష్, ఉపసర్పంచ్ మల్లెమొగ్గల ఉమాపతి, ఎస్ఐ జగన్నాథరెడ్డి, వీఆర్వో భూపతి పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు లబ్ధి

భాకరాపేట: జగనన్న సురక్షతో అర్హులకు లబ్ధిచేకూరుతోందని భాకరాపేట సర్పంచ్ సాకిరి భూపాల్ తెలిపారు. భాకరాపేట సచివాలయం వద్ద గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో దేవేంద్రబాబు, తహసీల్దార్ లోకేశ్వరి, ఎంఈవో సత్యనారాయణ, ఈవోపీఆర్డీ మదనమోహనరాజు, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్ పాల్గొన్నారు.

అక్కడికక్కడే సమస్యలు పరిష్కారం

ఎర్రావారిపాళెం(భాకరాపేట): అర్హులకు పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశమని ఎర్రావారిపాళెం ఎంపీడీవో అమర్నాథ్ తెలిపారు. కోటకాడపల్లె సచివాలయం వద్ద గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సంపూర్ణమ్మ, తహసీల్దార్ దస్తగిరయ్య, ఎంఈవో బాలసుబ్రమణ్యం, వెంకటసిద్ధులు, రమణయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రామచంద్రాపురం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీరాణి తెలిపారు. సీరామాపురంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రామాపురంలో 411 సర్వీసులను ఉచితంగా అందజేసినట్టు తెలిపారు. డీపీవో రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో మహ్మద్‌రఫీ, తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏవో స్రవంతి, సర్పంచి సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.